క్లుప్తంగా

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గాయత్రి

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపుల తోపుడు బండ్లు, వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గాయత్రి హెచ్చరించారు. మంగళవారం ఎస్‌ఐ స్థానిక మండల కేంద్రం మూడు రోడ్ల కూడలిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులకు తరలించరాదని హెచ్చరించారు. వాహనాలకు రికార్డులు తప్పనిసరి అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకే అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం వద్దు


నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డీఈఓ పురుషోత్తం

రామసముద్రం : మన బడి నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం తెలిపారు. మంగళవారం ఆయన రామసముద్రం మండలం చెంబకూరు హరిజనవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ హేమలత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జశ్వంతి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలకు సన్మానం

ములకలచెరువు : ములకలచెరువు మండలానికి ఎంఈఓ -2 గా శంకరయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వి.కోట మండలం లింగాపురం జెడ్పీహైస్కూల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరమణ, ఎంఈఓ -2 శంకరయ్యలను ఎస్టీయూ యూనియన్ నాయకులు సన్మానించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

రామసముద్రం : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మండలంలోని చెంబకూరు పంచాయతీ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే మొబైల్ ఫోన్లకు వచ్చే అపరిచిత కాల్స్‌ను నమ్మి వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పడం, పంపడం చేయరాదన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గెంగిరెడ్డి, సచివాలయం మహిళా పోలీస్ రేవతి పాల్గొన్నారు.

టీబీ రోగులకు మెరుగైన చికిత్స అందించండి

మదనపల్లె : టీబీ రోగులకు మెరుగైన వైద్యచికిత్స అందించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ శైలజ స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని టీబీ విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆస్పత్రిలోని టీబీ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయవ్యాధిగ్రస్తులను ఎప్పటికప్పుడు తగిన వైద్యపరీక్షలు చేసి గుర్తించాలన్నారు. అలాగే పట్టణంలోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

మదనపల్లె సిటీ : ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ అరికట్టాలని కోరుతూ మంగళవారం డివైఈఓ క్రిష్ణప్పకు ఏబీవీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు సాయిహితేష్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతో పాటు అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గౌతంరెడ్డి, రెడ్డిప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో సత్తా చాటిన శ్రీ సిద్ధార్థ

మదనపల్లె : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీ సిద్ధార్థ జూనియర్ కాలేజ్ సత్తా చాటింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 18న విడుదల చేసిన జేఈఈ ఫలితాల్లో సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థి జి.రిషికేష్‌రెడ్డి ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 2,913వ ర్యాంకును సాధించినట్లు ప్రిన్సిపాల్ ఈ.వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేఈఈ ఫలితాల్లో ఇప్పటివరకు టౌన్‌లో ఇదే అత్యుత్తమ రికార్డుగా చెప్పారు. అలాగే ఈఏపీసెట్ ఫలితాల్లో 5,189 ఉత్తమర్యాంకుతో తమ విద్యార్థిని దివ్యస్వరూప టౌన్‌ఫస్ట్‌గా నిలిచిందన్నారు.

పీలేరులో వేగంగా ఆర్‌ఓబీ నిర్మాణ పనులు

- ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ
- రూ. 120 కోట్లతో రెండు ఆర్‌వోబీలు మంజూరు
- ఇళ్లు కోల్పోకుండా చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణవాసులు


ఆర్‌వోబీ నిర్మాణానికి రోడ్డుపై అడ్డంకులను తొలగిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం చిత్తూరు మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారి-40లో వాహనాల రాకపోలకు అంతరాయం కలగకుండా ఇరువైపులా బారీకేడ్లు ఏర్పాటు చేసి పనులు చేపట్టారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి పీలేరు పట్టణంలో రైళ్ల రాకపోకల సమయంలో ట్రాఫిక్ సమస్యపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే, ఎన్‌హెచ్ మంత్రులతో సంప్రదించి ఆర్‌వోబీల మంజూరుకు కృషి చేశారు. పీలేరు పట్టణంలో చిత్తూరు రోడ్డు, మదనపల్లె రోడ్డుకు రూ. 120 కోట్లతో రెండు ఆర్‌వోబీలు మంజూరయ్యారు. ఇందులో మొదటి విడతగా చిత్తూరు రోడ్డు మార్గంలో రూ. 40 కోట్లతో 1.4 కిలోమీటర్లు పొడవు, 21 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు రూ. 14 కోట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.8 కోట్లు పంపిణీ చేశారు. అలాగే మదనపల్లె మార్గంలో జాతీయరహదారి 71పై ఆర్‌వోబీ త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. రూ. 66 కోట్లతో 1.2 కిలోమీటర్లు పొడవు, 70 అడుగుల వెడల్పుతో బ్రిడ్జి నిర్మాణం త్వరలో ప్రారంభం కానున్నాయి. స్థలాలు కోల్పోయిన వారికి ఇప్పటి వరకు రూ. 4 కోట్లు పంపిణీ చేశారు. ఆర్‌వోబీ పనులు ప్రారంభం కావడంతో పట్టణాలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పీలేరు అభివృద్ధికి మరింత సహకారం



పీలేరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య, వాహనదారుల రాకపోకల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వంకు విన్నవించి ఆర్‌వోబీలు మంజూరు చేయించాం. అలాగే పట్టణంలో ఎక్కువగా ఆస్తి నష్టం వాటిల్లకుండా బ్రిడ్జి విస్తరణ తగ్గించడంతోపాటు పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయించాం. పీలేరు అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లాప్పుడూ ఉంటుంది.

- పి.వి. మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

ప్రజల అభీష్టం మేరకు..



పీలేరు పట్టణంలోని ప్రధాన రోడ్డు అయిన ఎల్‌బీఎస్ రోడ్డు మార్గంలో ఆర్‌వోబీ నిర్మాణానికి 90 అడుగులతో బ్రిడ్జి మంజూరు అయింది. కాగా, ప్రజల అభీష్టం మేరకు ప్రజలకు నష్టం వాటిల్లకుండా బ్రిడ్జి విస్తరణ 90 నుంచి 70 అడుగులకు తగ్గించడం జరిగింది. ఎంపీ మిథున్‌రెడ్డి కేంద్ర మంత్రులతో సంప్రదించి వెడల్పు తగ్గించడంలో కీలకపాత్ర పోషించారు.

- చింతల రామచంద్రారెడ్డి, పీలేరు ఎమ్మెల్యే

రెండేళ్లలో ఆర్‌వోబీ పనులు పూర్తి



పీలేరు పట్టణం చిత్తూరు రోడ్డులో ఆర్‌వోబీ పనులు రెండు సంవత్సరాల్లో పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆర్‌వోబీకి సంబంధించి సర్వే ప్రక్రియ, స్థల సేకరణ పూర్తి అయ్యింది. స్థలం కోల్పోయిన నిర్వాసితులకు పరిహారంగా రూ. 8 కోట్లు పంపిణీ చేయడం జరిగింది. మిగిలిన వారికి త్వరలో పరిహారం అందిస్తాం.

- ఎం. సత్యమూర్తి, ఎన్‌హెచ్ డీఈ, చిత్తూరు

నెలలోపు పనులు ప్రారంభిస్తాం



పీలేరు - మదనపల్లె జాతీయరహదారి-71పై ఆర్‌వోబీ పనులు త్వరలో ప్రారంభిస్తాం. ప్రస్తుతం స్థల సేకరణ పనులు పూర్తి చేశాం. నష్టపోయిన నిర్వాసితులకు రూ. 4 పరిహారం పంపిణీ ప్రక్రియ జరుగుతోంది. పట్టణవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ మార్గంలో బ్రిడ్జి వేడల్పు తగ్గించడం జరిగింది.

- ఓ. నాగరాజు, ఎన్‌హెచ్ డీఈ, తిరుపతి

గోల్డెన్ టెంపుల్‌లో ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మంగళవారం వేలూరులోని గోల్డెన్ టెంపుల్‌ను దర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. నియోజకవర్గ ప్రజలు నిత్యం సుభిక్షంగా ఉండాలి, పాడి పంటలను పల్లెలు కళకళలాడాలని ప్రార్థనలు చేశారు.

23,24న మహిళాభివృద్ధి - సవాళ్లపై సెమినార్

మదనపల్లె సిటీ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో 23, 24 తేదీల్లో తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో 75 సంవత్సరాల స్వతంత్ర భారత మహిళల అభివృద్ధి,సవాళ్లు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. మంగళవారం కళాశాలలో సదస్సు నిర్వహణపై అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. సదస్సుకు జాతీయ స్థాయిలో వక్తలు,వివిధ కాలేజీల అధ్యాపకులు తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కరించడం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కురబలకోటవారిపల్లె, గంగిరెడ్డిపల్లె, లక్కావాండ్లపల్లె గ్రామాల్లో గడప గడపకుమన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రామంలో సీసీ రోడ్డు వేయించాలని కురుబలకోటవారిపల్లె గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తే నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే అన్నారు. వికలాంగ పింఛన్లు మంజూరు చేయాలని గంగిరెడ్డిపల్లెలో వికలాంగ యువకుడు కోరారు. అర్హత కలిగి ఒకే ఇంట్లో ఇద్దరు వికలాంగులు ఉన్నా ఇద్దరికి పింఛన్లు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చేయూత పథకం తమకు రాలేదని కొంతమంది మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఎందుకురాలేదో వివరణ ఇవ్వాలని ఏపీఎం వెంకటరమణను ఎమ్మెల్యే ఆదేశించారు. వైఎస్సార్ గృహాలు మంజూరు చేయాలని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వైఎస్సార్ ఇళ్లు మంజూరు చేయిస్తానని ఆయన హామీఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూసే బాధ్యత సచివాలయ ఉద్యోగులతో పాటు వలంటీర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సమ్రీన్‌ముక్తియార్, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్విరమణ, ఏపీ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షుడు నారదరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటశివారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సురేష్, నీళ్లశ్రీనివాసులు, నక్కామధుసూదన్, రాజన్న, సర్పంచ్‌లు రౌనఖ్‌భాషా, విశ్వనాథ్, ఎంపీటీసీ రాజగోపాల్, మాజీ సర్పంచ్ ఆకులరెడ్డెప్ప, బురుజుపల్లె శ్రీనివాసులు రెడ్డి, పాల్గొన్నారు.

ఉర్దూ భాషా మాధుర్యాన్ని ఆస్వాదించాలి


అబ్దుల్ కలీమ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వాల్మీకిపురం : దేశంలో పుట్టి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఉర్దూ భాషా మాధుర్యాన్ని ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలీమ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాష వలే ఉర్దూ కూడా ఎంతో మధురమైనదని, భాషలకు కులాలు, మతాలు ఉండవన్నారు. భాష ఏదైనా దానిని ప్రేమించాలని, అప్పుడే భాషపై పట్టు ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, పాఠశాల కమిటీ చైర్మన్ ఖాద్రి, ఉపాధ్యాయులు అయ్యాజ్, రోషన్ జమీర్, అలీ ఖాన్, శంకరప్ప, నవాజియా బేగం, కరీముల్లా, మెహతాజ్, గుల్జార్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యం


మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ

మదనపల్లె : విద్యార్థి దశలో యువత ఎలాంటి దురలవాట్లకు అవకాశం ఇవ్వకుండా క్రమశిక్షణతో, సత్ప్రవర్తనతో మెలిగితే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన అవేర్‌నెస్ ఆన్ యాంటీడ్రగ్ అండ్ సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశానికి నిజమైన సంపద యువతేనని, శత్రుదేశాలు యువతను నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతో మాదకద్రవ్యాలను మన దేశంలోకి అక్రమంగా తరలిస్తున్నారన్నారు. వీటిని యువతకు అలవాటు చేసి, తద్వారా వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు, డ్రగ్స్ కొన్నా, అమ్మినా వారిపైన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరస్తులు కొత్త కొత్త పద్ధతుల్లో పలురకాల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సెల్‌ఫోన్‌లకు లింకులను, మెసేజ్‌లను పంపి ప్రజలను ఏమారుస్తారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవ్వరికీ చెప్పవద్దన్నారు. సైబర్ క్రైమ్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్‌చేయాలన్నారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్‌ఐ సుబ్బారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష అమలు


బి.కొత్తకోట: మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరయ్య

బి.కొత్తకోట : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మండలస్థాయి అధికారులను ఎంపీడీఓ ఎం.శంకరయ్య సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి వలంటీర్లు ఇళ్లకు వెళ్లి ఏఏ కుటుంబాలకు ఏఏ పథకాలు అందలేదో, వారికి ఎలాంటి ధృవీకరణ పత్రాలను మంజూరు చేయాల్సి ఉందో గుర్తించాలన్నారు. జూలై ఒకటి నుంచి 15 వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. తహసీల్దార్ ఐదు, ఎంపీడీఓ ఐదు సచివాలయలను పర్యవేక్షిస్తారని చెప్పారు. ఏఈలు గిరిబాబు, దినేష్‌కుమార్, రజనీ, ఆర్ఐ బాలాజీ, సూపర్‌వైజర్ హిజాద్‌ప్యారీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం..

పెద్దమండ్యం : ఇంటింటికి వెళ్లి సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఒక్కరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 23 నుండి జూలై 23 వరకు జరుగుతుందన్నారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను గుర్తించాలన్నారు. మండల స్థాయిలో ఏర్పాటైన అధికారుల బృందాలు వాటిని సకాలంలో పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గౌరీశంకర్, ఈవోపీఆర్‌డి జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు జగన్‌మోహన్, ఖాదర్‌భాషా, రెడ్డిప్రసాద్, ఆయేషా, శైలజ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు ప్రభుత్వం ఇస్తున్న ఆస్తి నాణ్యమైన చదువు

- కార్పొరేట్ స్కూళ్లతో ప్రభుత్వ బడులు పోటీ
- జగనన్న విద్యాకానుక పంపిణీలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా


జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పిల్లలకు ప్రభుత్వం ఇస్తున్న ఆస్తి నాణ్యమైన చదువు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యాబోధన, వసతుల కల్పనలో కార్పొరేట్ స్కూళ్లు ప్రభుత్వ బడులతో పోటీపడుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దుతోందన్నారు. మంగళవారం పట్టణంలోని హోప్ హైస్కూల్(ఎయిడెడ్) పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి వరకు చదువుతున్న 43,10,165 మంది విద్యార్థులకు రూ.1,042.53 కోట్ల ఖర్చుతో విద్యాకానుక కిట్లను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి విద్యార్థికీ ఉచితంగా దాదాపు రూ.2,400 విలువచేసే కిట్‌ను ఇస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో స్కూల్స్ తెరిచి 6-7 నెలలైనా, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించలేని దుస్థితి ఉండేదన్నారు. నేడు పాఠశాల తెరచిన మొదటిరోజు నుంచే విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలన్నీ అందుబాటులో ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వపాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోవడం, విశాలమైన తరగతి గదులు, డెస్కులు, డిజిటల్‌బోధన, ఇంగ్లీష్‌ల్యాబ్స్, సీబీఎస్ఈ సిలబస్, బైజూస్ కంటెంట్‌తో ఉచిత ట్యాబ్‌లు, ప్రాథమిక స్థాయిలోనే ఇంగ్లీష్ మీడియంలో బోధన తదితర అనేక సంస్కరణలు వచ్చాయన్నారు. వీటన్నంటినీ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డేవిడ్‌సంజయ్, జేసీఎం చర్చి పాస్టర్. సునీల్ వరకుమార్, సెక్రటరీ భక్తవత్సలం, హెచ్ఎం.గ్రేస్ నళిని, ఉపాధ్యాయులు గ్రేస్.సుగుణమ్మ, భారతి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.7.9 కోట్లతో నగర పంచాయతీ తాగునీటి పనులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట నగర పంచాయతీకి తాగునీటి కష్టాలు తీర్చడం, ఇంటింటికి ఉచితంగా తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేయడం కోసం ప్రభుత్వం రూ.7.9 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు సత్వరమే చేపట్టేలా ఎస్ఆర్ కన్సల్టెన్సీ సంస్థ ద్వారా మంగళవారం సర్వే పనులు ప్రారంభించారు. నగర పంచాయతీకి రూ.5.2 కోట్లు, జగనన్నకాలనీలకు రూ.2.7 కోట్లు మంజూరయ్యాయి. నగర పంచాయతీకి మంజూరైన నిధులతో సంతబజారు పరిసరాల్లోని ఆరు బోర్లను జరుగుతున్న పంపింగ్‌ను డైరెక్టగా కాకుండా ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేసేలా నిర్ణయించారు. దీనికోసం సంతబజారులో 60వేల లీటర్ల సామర్థ్యం ఉన్న సంపును నిర్మించి బోర్ల నుంచి నీటిని తరలిస్తారు. సంపు నుంచి నీటిని కొత్తగా 9 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని తరలిస్తారు. దీనివల్ల విద్యుత్‌సరఫరాతో లేకుండా ప్రజలకు కొళాయిలకు నీటిని అందిస్తారు. రూ.2.7 కోట్లతో కురవానికుంట, బద్దిపల్లె కాలనీల్లోని జగనన్నకాలనీల్లో పేదలకు తాగునీటి సరఫరా, మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటారు. ఈ సర్వే పూర్తయ్యాక టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తామని ఏఈ అంజనేయులు చెప్పారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు సడలింపు ఇచ్చి క్రమబద్ధీకరించాలి

వాల్మీకిపురం : ఐదు సంవత్సరాల నిబంధనను సడలించి కాంట్రాక్ట్ అధ్యాపకులకు క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్, నాగేంద్ర, రమణ, రవి, శంకర, కళావతి పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

పెద్దమండ్యం : వాట్సాప్ ద్వారా ఫోన్ చేసి రూ. 80 వేలు కాజేసిన గుర్తుతెలియని వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయుడు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం గ్రామం కుంటలకాడపల్లెకు చెందిన ఎం. వెంకటాచలపతి నెట్ సెంటర్, మొబైల్ బ్యాంకింగ్ నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి తాను ఎస్‌ఐని అని చెప్పి వాట్సాప్ ద్వారా ఫోన్ చేసి రూ. 80 వేలు వేయాలని చెప్పాడు. నగదు స్టేషన్ దగ్గరకు వచ్చి తీసుకుపోవాలని తెలిపాడు. దీంతో ఫోన్‌పే ద్వారా రూ. 80 వేలు వేసిన వెంకటాచలపతి నగదు కోసం పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లాడు. అయితే అక్కడికి వెళ్లి ఫోన్ చేయగా ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించాడు. ఈ మేరకు తాను మోసపోయిన వైనంపై ఎస్‌ఐకి వివరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుష్టు నివారణపై అవగాహన

పీలేరు : కుష్టు నివారణపై అవగాహన కలిగి ఉండాలని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. మంగళవారం తలపులలో కుష్టు వ్యాధిపై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు కుష్టు వ్యాధి కావచ్చునని తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో మంగళవారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ ఫైరోజా బేగం

వాల్మీకిపురం : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధాన మంత్రి టిబి ముక్త భారత్ పోషన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా టిబి రోగులకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిని మొదటి దశలో గుర్తించి సరైన వైద్య సేవలతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చునన్నారు. టిబి వ్యాధి సోకితే భయపడాల్సిన అవసరం లేదని, మందులు వాడడం వలన త్వరగా నయం అవుతాయని తెలిపారు. బిడి, సిగరెటు, మందు, పొగాకు తదితరవాటికి దూరంగా ఉండాలని సూచించారు. రోగులకు పౌష్టికాహారం అందించేందుకు పద్మావతి హెల్త్ సొసైటీ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివయోగి సోమశేఖర్, టిబి యూనిట్ సిబ్బంది మురళి, నాగిరెడ్డి, క్రిష్ణమూర్తి, ఉపాధ్యాయులు రమేష్, సరిత, మోహనరామ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యం


డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగేశ్వర రావు

వాల్మీకిపురం : డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యమని వాల్మీకిపురం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్ తదితర డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తాయన్నారు. పొరపాటున యువత ఇలాంటి వాటికి అలవాటు పడితే వ్యసనపరులుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. యువత వీటి జోలికి వెళ్ళదన్నారు. డ్రగ్స్‌ను వినియోగిస్తే ఆరు నెలలు జైలు శిక్ష పడుతుందన్నారు. డ్రగ్స్‌ను కలిగి ఉండడం, వాటిని అమ్మినా 10 నుంచి 20 సంవత్సరాలు జైలు శిక్ష తప్పదన్నారు. డ్రగ్స్ సంబంధిత నేరాలను ప్రోత్సహించడం నేరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ విద్యార్థుల హాజరు మెరుగుపరచాలి


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ ధనలక్ష్మి

మదనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యార్థుల హాజరు మెరుగుపడేలా కార్యకర్తలు కృషి చేయాలని ఐసీడీయస్ పీడీ ధనలక్ష్మి సూచించారు. మంగళవారం మదనపల్లె ఐసీడీయస్ ప్రాజెక్ట్ పరిధిలోని బాలాజీనగర్, పుంగనూరువాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ పిల్లలతో ప్రతిరోజు నిర్వహించే ప్రీ స్కూల్ ఆక్టివిటీస్‌ను చేయించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ విద్యార్థుల హాజరు మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి, నిర్వహణపై సదస్సు నిర్వహించారు. గర్భవతులు, తల్లులు మధ్యాహ్నభోజనానికి హాజరు అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.